తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## గణనాథుని సన్నిధిలో కేంద్ర ఎన్నికల పరిశీలకులు



కాణిపాకం, మార్చి 16 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్ర పరిశీలకులు రోహిత్‌కుమార్, సౌరభ్‌రానా, దీపక్ కుమార్‌లు గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యా సాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అలాగే వీరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు పాల్గొన్నారు.

## మండుటెండలో పన్నీటి జల్లు..

### శాంతిపురంలో వడగళ్ల వర్షం



కుప్పం/ శాంతిపురం, మార్చి 16 ప్రభాతవార్త బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గురువారం సాయంత్రం కుప్పం నియోజకవర్గంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురవగా ఎండ తీవ్రత ధాటికి ఉక్కపోత భరించిన ప్రజలకు ఉపశమనం కలిగించింది. శాంతిపురం మండలంలో పలుచోట్ల వడగళ్ల వర్షం కురిసింది. కాగా అకాల వర్షంతో మామిడి పంటకు నష్టం కలుగుతుందని రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు.

# గంజాయి స్మగ్లర్ల ఆటకట్టు

### కారుతో సహా 24 కేజీల గంజాయి స్వాధీనం



ముద్దాయిలు అరెస్టు చపుతున్న అర్బన్ పోలీసులు

రేణిగుంట, మార్చి 16 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ రామచంద్ర పర్యవేక్షణలో అర్బన్ సీఐ సుబ్బారెడ్డి నేతృత్వంలో పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపారు. గంజాయి స్మగ్లర్ల కదలికలపై గట్టి నిఘా ఉంచారు. ఈ క్రమంలో బుధవారం రేణిగుంట రమణ విలాస్ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా టీఎన్ 02 బీడీ 0538 నంబరు గల కారు వేగంగా వస్తూ పోలీసులు చూసి అకస్మాత్తుగా నిలిచిపోయింది. అనుమానం వచ్చిన పోలీసులు శరవేగంతో కారు వద్దకు పరుగులు తీశారు. అందులో ఉన్న ఇద్దరు పారిపోగా రేణిగుంట ఏఎన్ఆరన కాలనీకి చెందిన కుమార్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. కారులో తనిఖీ చేయగా సుమారు 19 కేజీల గంజాయి లభించింది. అతన్ని అదుపులో తీసుకుని కారుతో సహా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కుమార్‌ను విచారించగా తీగ లాగితే డొంక కదిలిందన్న చందాన గంజాయి స్మగ్లింగ్ విషయం బయట పడిందని డీఎస్పీ రామచంద్ర విలేకరుల సమావేశంలో తెలిపారు. కారు నుంచి పారిపోయిన వారిలో మండలంలోని కుర్రకాల్వ లోక ఉన్నాడన్నారు. మండలంలోని అంకమ్మనాయుడు మిట్ట వద్ద గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులు ఉన్నారని కుమార్ తెలపడంతో పోలీసులు హుటాహుటిన అక్కడ చేరుకున్నారు. గంజాయి స్మగ్లింగ్‌తో సంబంధం ఉన్న పురుషోత్తమన్ మణికంఠ, రాజు, పెరుమాళ్ శివ, కన్నన్‌లను అదుపులోకి తీసుకోగా ఓటేరుకు చెందిన వంశి పారిపోయాడు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో కలిపి మొత్తం 70 వేల రూపాయల విలువ గల 24 కేజీల గంజాయి లభించింది. వీరంతా విశాఖపట్నంలో గంజాయి కొని తమిళనాడు-చెన్నైలోని కొంత మంది గంజాయి వ్యాపారులకు సరఫరా చేస్తున్నట్టు డీఎస్పీ రామచంద్ర విలేకరులకు తెలియజేశారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పారిపోయిన వారినేకాక గంజాయి వ్యాపారం వెనుక ఉన్న సూత్రధారులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న వారిని ఉపేక్షింపమన్నారు. రెంకు అంతకు మించి కేసులు నమోదైన వారిపై పీడీ యాక్టు పెడతామని ఈ సందర్భంగా అన్నారు. గంజాయి అమ్మడమే కాదు కొనడం సేవించడం నేరమన్నారు. అలాంటి వారిని ఇప్పటి వరకు 30 మందిని గుర్తించామన్నారు. తగిన సాక్షాధారాలతో న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామన్నారు. అదుపులోకి తీసుకున్న ముద్దాయిలను రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, సిబ్బంది సోమశేఖర్, రాజశేఖర్, బారూష, మణి, శీను, సురేష్‌లను అభినందిస్తూ వీరికి రివార్డుల కోసం ఎస్పీకి సిఫార్సు చేస్తామన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన సెకెండ్ ఇయర్ పరీక్షలు

### 1161 మంది విద్యార్ధులు గైర్హాజరు

**సిసి కెమెరాలు నిఘాలో పరీక్షలు.. ఇద్దరు విద్యార్ధులు డిబార్**

తిరుపతి (విద్య), మార్చి 16, ప్రభాతవార్త ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు గురువారం ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. మొత్తం రెండు జిల్లాలోని 141 సెంటర్లల్లో జనరల్ కేటగిరిలో 42300 మంది విద్యార్ధులకు గానూ 1161 మంది విద్యార్ధులు గైర్హాజరయ్యారు. మొత్తం 41139 మంది విద్యార్ధులు పరీక్షలు రాశారని, అదే విధంగా తిరుపతిలో ఇద్దరు విద్యార్ధులు డిబార్ అయినట్లు తిరుపతి ఆర్ఐవో వి రమేష్ విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా రెండవ రోజు కూడా పరీక్షలు రాస్తున్న విద్యార్థుల యొక్క హాల్ టికెట్‌లో సరైనటువంటి సెంటర్ యొక్క అడ్రస్ లేనందు వలన చాలా మంది విద్యార్ధులు అడ్రస్ తెలియక ఆందోళన చెందారు. ఈ విషయంలో ఇంటర్మీడియట్ బోర్డు ఘోరంగా విఫలమైందని చెప్పొచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం మేరకు సిసి కెమెరాలు, పోలీస్, రెవెన్యూ, ఇంటర్ విద్యా శాఖ అధికారులు, ఇతర అధికారుల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష జరిగాయి. నేడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్ధులకు ఇంగ్లీష్ పేపర్ వన్ జరుగుతుందని తెలిపారు.

# టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి ముందంజ

### రెండవ ప్రాధాన్యత ఓట్లతో పిడిఎఫ్ అభ్యర్థి గెలిచే అవకాశం - ఉత్కంఠతతో సాగిన ఓట్ల లెక్కింపు



చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త: ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్యత ఓట్లలో వైకాపా అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి ముందంజలో వున్నారు. వైకాపా అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డికి 10,862 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించగా పిడిఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి పొక్కిరెడ్డికి 8,908 ఓట్లు లభించాయి. టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఓట్లు లభించాల్సి వుండటంతో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికి సగం ఓట్లు లభించకపోవడంతో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుకు రాత్రి 10.30 గంటలకు అధికారులు శ్రీకారం చుట్టారు. రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపడితే తెలుగుదేశం మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ఎల్‌సి రమణారెడ్డికి 3,465 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించడంతో ఈయన ఎలిమినేషన్ అయితే ఈయనకు చెందిన రెండవ ప్రాధాన్యత ఓటు పిడిఎఫ్ అభ్యర్థికి పడే అవకాశం వుండటంతో ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గెలిచే అవకాశం వుంది. చిత్తూరు ఎస్‌విసెట్ కళాశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో వైకాపా అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డికి 10,862 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించగా, పిడిఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి పొక్కిరెడ్డికి 8,908 ఓట్లు లభించాయి. తెలుగుదేశం అభ్యర్థి ఎల్‌సి రమణారెడ్డికి 3,465 ఓట్లు లభించగా కుట్టుబోయిన బ్రహ్మానందంకు 623, గుర్రం శ్రీరామ్మూర్తికి 325, ధనంజయ శివయోగికి 31, ప్రవీణ పర్వతరెడ్డికి 36, అనసూయ లక్కుకి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించాయి. పోలైన 24,747 ఓట్లలో 24,291 ఓట్లు చెల్లుబాటు కాగా 456 ఓట్లను చెల్లని ఓట్లుగా అధికారులు నిర్ధారించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించాలంటే ఎన్నికల్లో పోటీ చేసిన ఏ అభ్యర్థికైనా పోలైన ఓట్లలో సగం ఓట్ల కంటే ఒక్క ఓటు అధికంగా సాధిస్తే ఆ అభ్యర్థిని ఎన్నికల కమీషన్ ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ప్రకటిస్తుంది. అంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించాలంటే ఏ అభ్యర్థికైనా 12,374.5 ఓట్లు రావాల్సి వుంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో 10,862 ఓట్లు సాధించిన వైకాపా అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి విజయం సాధించాలంటే రెండవ, మూడవ, నాల్గవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో మరో 1,512 ఓట్లు సాధించాల్సి వుంటుంది. అలాగే పిడిఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి పొక్కిరెడ్డి 8,908 మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించడంతో ఈ ఎన్నికల్లో విజయం ఆయనకు వరించాలంటే రెండవ, మూడవ, నాల్గవ ప్రాధాన్యత ఓట్ల కింద మరో 3,466 ఓట్లు సాధించాల్సి వుంది. రెండు, మూడు, నాల్గవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం కావడంతో తక్కువ ఓట్లు వచ్చిన ఒకొక్క అభ్యర్థి ఎలిమినేషన్ చేసుకొంటూ వెళ్ళి వారికి వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లను లెక్కించుకొంటూ వెళితే చివర్లో అత్యధిక ఓట్లు సాధించిన తెలుగుదేశం అభ్యర్థి రమణారెడ్డి ఎలిమినేషన్ అవుతారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ మొదటి ప్రాధాన్యత ఓటు తమ అభ్యర్థికి వేసి రెండవ ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థికి వేయాలని స్పష్టం చేయడంతో ఈ మేరకు ఈ ఎన్నికల్లో రెండవ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పిడిఎఫ్ అభ్యర్థి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### ఈ బడ్జెట్...పేదరిక నిర్మూలనకు

## పునాది లాంటిది

### : మంత్రి రోజా



పుత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలో అయిదోసారి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పునాది లాంటిదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడా శాఖల మంత్రి ఆర్.కె.రోజా పేర్కొన్నారు. బడ్జెట్‌పై గురువారం ఆమె మాట్లా డుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లో పేదలకు ఆర్థికంగా ప్రోత్సాహాన్ని అందించేలా బడ్జెట్ వుందని ప్రశంసించారు. డిబిటి పథకాలకు రూ. 54,228 కోట్ల కేటాయింపులు చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ కొండంత భరోసా కల్పించిం దన్నారు. బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు వేలాది కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా జగనన్న మాట తప్పరు, మడమ తిప్పరని మరోసారి రుజువైందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మహిళలకు ఇళ్ల నిర్మాణం, అమ్మఒడి, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలకు పెద్ద ఎత్తున కేటాయింపులు జరిపి మహిళా పక్షపాతి అని జగన్మోహనరెడ్డి నిరూపించుకున్నారని తెలిపారు. ఒక మహిళా మంత్రిగా మహిళల సంక్షేమం పట్ల ఆయన వున్న శ్రద్ధకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నానని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికవృద్ధి, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్ తర్వాత రాష్ట్ర ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయ్యేలా ఈ బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. ఇలాంటి బడ్జెట్ ప్రతులను చించేసిన తెలుగుదేశం పార్టీకి ఈ బడ్జెట్ ద్వారా మేలు జరిగే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అగ్రవర్ణాల పేదలు రానున్న రోజుల్లో వాళ్ల భవిష్యత్‌ను చించివేయడం ఖాయమని పేర్కొన్నారు.

## వేడుకగా గురునాధస్వామి,అంకమ్మల గ్రామోత్సవం

చిల్లకూరు మార్చి 16 ప్రభాతవార్త



తూర్పు కనుపూరు గ్రామంలో వెలసియున్న ముత్యాలమ్మ తల్లి జాతరలో భాగంగా గురువారం ఘనంగా గురునాధస్వామి అంకమ్మ ,సత్తి పోలేరమ్మ,సిద్దలయ్య,పరుశరాముడుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గంగపెట్టి నెత్తిన పెట్టుకొని గొల్లలు వీరతాళ్ళు వేసుకుంటు తప్పెట్లు,తాళలు, పంబజోళ్ళు,కొమ్ము వూదతు బాణాసంచాల నడుమ ఉరేగింపు ఘనంగా నిర్వహించారు.రాత్రి ఘణాచారిని రెండు తాడిచెట్ల మధ్య ఏర్పాటు చేసిన ఉయ్యాలలో ఉయ్యాల సేవ నిర్వహించారు. ఆఖరిరోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా కనుపూరు చుట్టుపక్క గ్రామాల ప్రజలు పోలేరమ్మ ,ముత్యాలమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయాల చుట్టు భక్తులు వెయ్యి కళ్ళ కుండలు నెత్తిన పెట్టుకొని వేప చీరలు చుట్టుకొని పిల్లలు లేని మహిళలు రాగి చెట్టుకు ముడుపులు కట్టుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా అమ్మవారి గుడిపైన కోడిపిల్లలు, యర్రగడ్డలు, మిరియాలు చల్లుతో ప్రదక్షణలు చేస్తు అమ్మలగన్న అమ్మ .....ముత్యాలమ్మ..... అంటు వేడుకున్నారు. ఆలయ ఇఒ నవీన్‌కుమార్ అధికారులు, సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాటు చేశారు. చివరిరోజు రద్దీనీ దృష్టిలో వుంచుకొని డిఎస్‌పి సూర్య నారాయణరెడ్డి ఆద్వర్యంలో సిఐలు దశరధరామారావు, హరికృష్ణాతోపాటు చిల్లకూరు ఎస్ఐ బి .గోపాల్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.చింతవరం ప్రాంతీయ వైద్యులు పాల్ జేమ్స్ న్ ఆద్వర్యంలో 108,104 తోపాటు మెడికల్ కా ్యంపులు నిర్వహించారు. సాయింత్రానికి భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో కనుపూరు జనసంద్రంగా మారింది.కార్యక్రమంలను ఇఒ కె నీవన్‌కుమార్ ,ఆలయ మాజీ చైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, మాజీకమీటి సభ్యులు దువ్వూరు సాయికృష్ణారెడ్డి , దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.ఆదానీ కృష్ణపట్నం పోర్టు వారు భక్తుల వినోదం కోసం పాటకచ్చేరి ఏర్పాటు చేశారు.అదే విధంగా నవనీత పబ్లిక్‌స్కూల్ యాజమాన్యం ఉదయం నుండి ఆలయంలోపల భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పులిహోర,పొంగలి దద్దొజనం,మంజిగ ప్యాకిట్లు అందించారు.ఈకార్యక్రమంలో ఎస్ .సుబ్బారావు, హేమలత,ఎం.నీలిష్ హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల వ్యవసాయం: తిప్పల అమ్మకాలు

### పంట పొలంపై ఉంటే రూ.వేలు: చేతికొస్తే రూ.వందలు వరి రైతు ఆందోళన



శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త పంటలు పండించుటకు అప్పులు చేస్తే ఓ ధర, చేయకుంటే మరో ధర' గత ఏడాది ఎంతో ఆశాజనకంగా ఉన్న వరి మద్దతు ధర ఈ ఏడాది పూర్తిగా పడిపోయింది. రైతులు పండించిన రకం ధాన్యం ధరలు రైతుల్ని నిరాశకు గురిచేస్తున్నాయి.దాంతో ఆరుగాలం కష్టించి పండించిన రైతులకు కన్నీళ్ళు,కష్టాలు, అప్పుల తిప్పలు తప్పటం లేదు. గత ఏడాది పంటకోతల సమయంలోనే బస్తా వెయ్యిరూపాయలు చెల్లించి దళారులు తీసుకెళ్ళారు. ఈ ఏడాది సీజన్ పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు బస్తా ధర రూ.900 కన్నా పెరగటం లేదని అన్నదాతలు ఆర్తనాదాలు చేస్తున్నారు. నిత్యావసర సరకుల ధరలు మార్కెట్‌లో దడ పుట్టిస్తుంటే, బియ్యం ధరలకు రెక్కలొస్తే వరి పంటకు మాత్రం ధరలు పలకటం లేదని వాపోతున్నారు.

**జిల్లాలో ధాన్యాగారం-రైతుల ఆర్తనాదం!**

తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లోని గ్రామాలు అధికారుల లెక్కల్లో ధాన్యాగారాలుగా ప్రసిద్ధి చెందాయి.అయితే ఈ ప్రాంతాల్లోని రైతులు గత ఐదేళ్ళుగా మద్దతు ధరల కోసం పోరాటం సాగిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో సుమారు 50వేల ఎకరాల్లో వరి పంటను పండిస్తారు. తెలుగుగంగ పథకం వచ్చిన తరువాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం, సత్యవేడులోని బుచ్చినాయుడుకం డ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో వరిపంటను రెండు కార్లు పండించే వారు. పిచ్చాటూరు,నాగలాపురం మండలాల్లో ఆరణియార్ ప్రాజెక్టు రైతుల పంటలకు ప్రాణంగా ఉన్నాయి. ఇక్కడ రైతులు ప్రస్తుతం రబీ,ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు.వారి పంట పొలాల్లో ఉన్నపుడు ఆకాశానికి వెళ్ళి రైతుల్ని ఆశల పల్లకిల్లో పయనింపజేసే ధరలు కోతల సమయానికి ఉండటం లేదు. గతంలో రైతులు బిపిటి 5204 సోనా మసూర వరికి ఇక్కడ అనుకూల వాతావరణం లేకున్నా పోలోమని పండించారు. ఈ వరికి ఇక్కడ వాతావరణం సరిపోక రక రకాల తెగుళ్ళతో సతమతమయ్యారు. పంటకు తెగులు ఆశించిందనగానే రైతులు దుకాణం దారుల సూచనల మేరకు అన్ని రకాల మందులి ్న వాడారు పంట పెట్టుబడికన్నా అధికంగా తెగుళ్ళ నివారణకు వెచ్చించారు.ఈ ఏడాది రబీసీజన్‌లో స్వల్పకాలిక వంగడం ఎడిటి 37 (బుడొడ్లు) పోలోమని పండించారు. గిట్టుబాటు కాని ధరలతో రైతులు తిప్పలు పడి పండిస్తే గిట్టుబాటు ధర లేక తల్లడిల్లుతున్నారు.గత ఏడాది ఈ రకం వరి ధాన్యం బస్తా రూ.1200 నుంచి వెయ్యి రూపాయలు పలికింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరల్లేదు. ఇళ్ళలో నిల్వ చేసుకునే అవకాశం లేదు.దాంతో కల్లాల్లోనే నిల్వ ఉంచారు. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి పరిశీలిస్తే దళారులు ముందుగా అడ్వాన్సు ఇచ్చి ఉంటే బస్తా రూ.800 మాత్రమే. అలా కాకుండా నగదు వ్యాపారం అయితే రూ.820 మాత్రమే పలుకుతుంది.ఆర్‌బికే కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రతిపాదన ప్రహసనంగామారింది. దాంతో పెట్టుబడులు కూడా రావనే అసంతృప్తి చోటు చేసుకుంది. ఇలా అయితే వ్యవసాయం ఏం చేయాలనే సందిగ్ధంలో రైతులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికి వరి కుప్పలు ఏ పంట పొలాల్లో అయినా దర్శనమిస్తున్నాయి.ఏ గ్రామంలో ఊసినా పంట పొల్లాల్లో రోడ్ల పక్కన పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో రైతులు అవస్థలు పడుతున్నారు.

**దళారుల తూకాల మోసం:**

ఓ వైపు రైతులు గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లుతుంటే మరో వైపు దళారుల మోసాలు షరా మామూలే అన్నట్లు మారింది. దళారుల త్రాసులు, తూకపు రాళ్ళు కొనుగోళ్ళలో ఒక రకంగాను అమ్మకాల్లోమరో రకంగా ఉంటున్నాయి. దాంతో రైతులు అడుగడుగునా మోసపోతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసే రాళ్ళ బరువు మామూలు తూకం కన్నా బస్తాకు ఐదు కిలోల వరకు అధికంగా తీసుకుంటున్నారని వాపోతున్నారు. ఇది కాక తరుగు అంటూ మరో రెండు మూడు కిలోలు మినహాయిస్తున్నారు.ఇలా అన్నదాతలు గిట్టుబాటు ధరలే లేదని తల్లడిల్లుతుంటే మరో వైపు దళారుల మోసాలతో కుదేలౌతున్నారు. మరి అన్నదాతల బాగు కోరే ప్రభుత్వం మద్దతు ధరలకు తీసుకుంటున్న చర్యలేమిటో వారికే తెలియాలి.

## టిప్పర్ ఢీకొని ఒకరు మృతి..

### మరొకరికి తీవ్రగాయాలు



రామచంద్రాపురం, మార్చి 16 ప్రభాతవార్త: ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి రాయలచెరువు పేట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టింది. రాయల చెరువు పేటకు చెందిన కేశవులు రెడ్డి, సురేష్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై పచ్చికాపల్లం నుండి రాయల చెరువు పేటకు వస్తుండగా, తిరుపతికి వెళుతున్న టిప్పర్ వెనుక నుండి అతివేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో సంఘటనా స్థలి హృదయ విధారకంగా తెగిపడిన కాలు, చేయి రక్తసిక్తమై గుండెలను గగుర్పొడిచే విధంగా మారింది. ఈ ప్రమాదంలో కేశవులు రెడ్డి కాలు, సురేష్ చేయి శరీరం నుండి తెగి వేరు పడ్డాయి. ఈ ఘటనతో రోడ్డు రక సిక్తమై క్షతగాత్రుల ఆర్తనాధాలు చూపరులను కలచివేసింది. ఈ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలిస్తుండగా కేశవులు రెడ్డి మృతి చెందాడు. సురేష్ పరిస్థితి విషమంగా వున్నది. పోలీసులు కేసు నమోదు చేసి ద్యాప్తు చేపట్టారు. ఇదిలా వుండగా ఈ నెల 7న దుర్గ సముద్రం ప్రధాన రహదారిలో టిప్పర్ ఢీకొట్టిన ప్రమాదంలో సి.రామాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగమణి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మరువక ముందే మరో విషాధం చోటు చేసుకోవడం పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు, వాహనచోదకులు తీవ్ర భయాంధోళనకు గురవుతున్నారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోనట్లయితే ఈ మార్గంలో టిప్పర్లను తిరగనివ్వబోమని హెచ్చరిస్తున్నారు.

## మా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసే అర్హత నీకు లేదు



-సామంచి శ్రీనివాస్‌కు కట్టా గోపియాదవ్ హెచ్చరిక

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 16 ప్రభాతవార్త:** తిరుపతిలో ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని విమర్శించే అర్హత బిజెపి నేత సామంచి శ్రీనివాస్‌కు లేదని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, గంగమ్మ గుడి చైర్మన్ కట్టా గోపియాదవ్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జన మహోత్సవం పేరుతో అందరి దగ్గర డబ్బులు వసూలు చేసి పబ్బం గడుపుకునే నీకు వినాయక చవితి మహోత్సవాలే కాకుండా, వినాయక సాగర్‌ను అత్యంత సుందరంగా అభివృద్ధి చేసింది కనపడలేదా అని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల నియమావళి ప్రకారమే ఏ రాష్ట్రంలో అయినా ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల నియమావళిని ఎమ్మెల్యే తుంగలో తొక్కారని ఆరోపణలు చేశావు. కొన్ని రాష్ట్రాలలో కనీసం ఎమ్మెల్యే సీట్లు రాకపోయినా, ఆ రాష్ట్రంలో బిజెపి జెండా ఎగురవేయడానికి ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కి అడ్డదారుల్లో గెలవడం ఒక్క బిజెపికే చెల్లిందన్నారు. తిరుపతిలో యాదవులకు ఇంతవరకు ఏ పార్టీ ఇవ్వని గౌరవం, పదవుల్లో సముచిత స్థానం ఒక్క వైసిపి పార్టీ మాత్రమే ఇచ్చిందన్నారు. చరిత్రలో ఇంతవరకు ఎవరూ చేయని విధంగా తిరుపతి పుట్టిన రోజు వేడుకలను గత రెండేళ్లుగా ఎమ్మెల్యే భూమన నిర్వహించడం పట్ల నగరంలోని ప్రజలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తుంటే.. నువ్వు ఇలా ఎమ్మెల్యేని విమర్శించడం నీచమన్నారు. ఇంకొక్క సారి భూమన గురించి అవాకులు, చవాకులు పేలితే మీ బిజెపి నాయకుల జాతకాలు మొత్తం తిరుపతి ప్రజల ముందు ఉంచుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మగుంట రవి, చింతా రమేష్‌యాదవ్, కృష్ణమూర్తి, బస్వ బాలసుబ్రహ్మణ్యం, బాలాజి, మోహన్‌బాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘంలో భారీ చేరికలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 16 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపు మేరకు గురువారం భారీగా బిసిలు చేరడం జరిగింది. గ్రామ, వార్డు స్థాయిలో ఏపి బిసి సంక్షేమ సంఘం బలోపేతానికి తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె. నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి టి. సోమశేఖరాచారి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా మధు మార్గాచార్యులు, నగర ఉపాధ్యక్షుడిగా అలగాని మురళి గౌడ్, అర్బన్ ఉపాధ్యక్షుడిగా కన్నెమడుగు మునిరాజులు నియమించబడ్డారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం నూతన రాజకీ పార్టీగా ఆవిర్భవిస్తున్న తరుణంలో ప్రతి వార్డులో, ప్రతి గ్రామంలో సంఘం బలోపేతానికి తీసుకోవాల్సి న అన్ని ప్రయత్నాలు చేస్తూ రాబోవు ఎన్నికల్లోపు జిల్లాలో సంఘం నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

## నేడు వరదరాజస్వామి మూల విరాట్టు తొలగింపు

**శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న వైష్ణవాలయం ప్రసన్నవరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. అయితే పురాతనమైన ఆలయం కావటంతో నిర్మాణం పూర్తిగా దెబ్బతింది. దాంతో పునర్నిర్మాణమే శరణ్యమని దేవాదాయశాఖ రాష్ట్ర స్థపతి స్పష్టం చేసారు. రూ. 4కోట్లతో ఇక్కడ ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయంలోని ఇతర పరివార దేవతల విగ్రహాలను తొలగించారు. మూలవిరాట్టును శుక్రవారం తొలగించుటకు సుముహూర్తంగా నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9గంటలకుపంచనామానిర్వహించుటకునిర్ణయించినట్లుచైర్మెన్అంజూరుతారకశ్రీనివాసులు వివరించారు. ఈ తొలగింపుకుసంబంధించి పారదర్శకతతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసామని అలాగే పట్టణ ప్రముఖులను ఆహ్వానించామన్నారు. కొత్త ఆలయ నిర్మాణానికి శరవేగంగా పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## ప్రతిభకు ప్రత్యేక అభినందనలు

**తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త**



జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర డిప్యుటీ చైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంటభరత్‌రెడ్డిల ప్రతిభకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశ రాజధాని డిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుధవారం జరిగిన ప్రపంచ వినియోగదారుల హక్కులదినోత్సవ వేడుకల్లో కోటేశ్వరబాబు, భరత్‌రెడ్డిలను ప్రత్యేకంగా దుశ్శాలువతో సత్కరించి మెమెంటోను అందించారు. ఇద్దరు ఎన్‌సిఆర్‌సిలోబాధ్యతలు తీసుకున్న అనతికాలంలోనే వినియోగదారులు తరపున 43కేసులు నమోదు చేయించడంతో పాటు వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో అతిరథ మహారథుల మధ్య సన్మానం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించడంత పాటు ఇద్దరిని అభినందించారు.

## సిపాయి గారూ..ఆత్మ పరిశీలన చేసుకుని విమర్శించండి!

-వన్నెకుల క్షత్రియనేతల హితవు



**శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త**

రష్ ఆస్పత్రి అధినేత, ఎంఎల్‌సి సభ్యులు డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం మాట్లాడే ముందు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని వన్నెకులక్షత్రియ నేతలు మిన్నల్‌రవి, చిన్నారెడ్డిలు హితవు పలికారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఎవరో చెప్పిన మాటలు విని గౌరవ ప్రదమైన స్థానంలో ఉన్న డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం వాస్తవాలు తెలుసుకోకుండా టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి గురించి విమర్శించడం భావ్యం కాదన్నారు. డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం అంటే తమకంతే గౌరవం ఉందని అలాంటి వ్యక్తి ఇతరులు చెప్పిన మాటలు నమ్మి విమర్శలు చేయడం తగదన్నారు. బొజ్జలగోపాలకృష్ణారెడ్డి కుటుంబం ఎలాంటిదో తమకంటే సిపాయి సుబ్రమణ్యంకే ఎక్కువగా తెలుసన్నారు. దామోదరం అనే వ్యక్తి మాటలు విని ఎంఎల్‌సి సిపాయిసుబ్రమణ్యం ఇలా చేయడం దారుణమని విమర్శించారు. దామోదరం పొద్దుతిరుగుడు పువ్వులాంటి వ్యక్తిని అని అధికారం ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్తారన్నారు. అలాంటి వ్యక్తి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని విమర్శించడం ఏమిటని వారు ఆక్షేపించారు. దామోదరం తెలుగుదేశం హయంలో ఎంతో లబ్దిపొందారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వన్నెకులక్షత్రియులపై దాడులు పెరిగి పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్వార్ధరాజకీయాలకోసం కులం తాకట్టు పెట్టి వారిని నమ్మవద్దని కోరారు. సమావేశంలో పోలూరుశ్రీనివాసులురెడ్డి, ఎంఎస్‌రెడ్డి, మంగారెడ్డి, బయ్యారెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మురళీ, మణి, గుణశేఖర్, మణికంఠ, మహేష్‌రెడ్డి, వన్నెకులక్షత్రియనేతలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకం ద్వారా జీవన ప్రమాణాలు పెంచాలి

**తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త**



ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చేయడానికి అందరు కృషి చేయాలని ఈటిసి రీజనల్ కోఆర్డినేటర్ సునీల్ కుమార్ తెలిపారు. ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి గురువారం ఈటిసి కేంద్రంలో 9జిల్లాలకు చెందిన ఉపాధిహామీ అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని అతిధులు జ్యోతివెలిగించి ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఎపిఓలు, ఇంజనీర్లుకు మూడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. దేశవ్యాప్తంగా పర్యవేక్షణ చేసే విధంగా కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తూ పథకానికి సంబందించిన అన్ని సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పనులకు ఎంపిక చేయడం ఉపాధి కూలీల నమోదు, ఉపాధి కూలీలకు నగదు చెల్లింపు తదితర అంశాలకు సంబందించి ఎప్పటికప్పుడు వస్తున్న నూతన అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశరాణి, 9జిల్లాల నుంచి వచ్చిన ఉపాధిహామీ ఎపిఓలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**విజయపురం, మార్చి 16 ప్రభాతవార్త :**



మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆంధ్రరాష్ట్రం కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సతీష్, ఇఒ పిఆర్‌డి బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాత్రి వాచ్‌మెన్ గుండెపోటుతో మృతి

**శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలోని నాగాలమ్మ వీధికి చెందిన ధర్మయ్య (52) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ధర్మయ్య కుటుంబ పోషణ ప్రశ్నార్థకంగా మారిందని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డికి విన్నవించుకోవటంతో నిరుపేదలకు అండగా ఉంటూ ఆదుకుంటున్న ఆయన వెంటనే ధర్మయ్యను నైట్ వాచ్‌మెన్‌గా నియమించుటకు అధికారులకుఆదేశించారు. అలాగే ఆతని భార్య మనోరమకు పారిశుద్ధ్య విభాగంలో పని కల్పించారు. ఐదునెలలుగా పనులు చేసుకుంటూ ధర్మయ్య కుటుంబం స్థిమితంగా ఉన్నారు. అయితే గురువారం ధర్మయ్యకు గుండెపోటు రావటంతో మృతి చెందాడు. పారిశుద్ధ్య శాఖ కార్మికులు స్పందించి రూ. 20వేలు పొగు చేసి దహన సంస్కారాలకు అందించారు.

## మండల విద్యాశాఖాధికారిగా శంకరయ్య బాధ్యతలు స్వీకరణ



**వెదురుకుప్పం, మార్చి 16 ప్రభాతవార్త :** మండల విద్యాశాఖాధికారిగా కె. శంకరయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యాశాఖాధికారిగా కార్వేటినగరం ఎంఇవో విజయ్ కుమార్ ఇన్స్‌చార్జ్‌గా వ్యవహారిస్తూ వచ్చారు. కాగా మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల విద్యాభివృద్ధి కృషి చేయడంతో పాటు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. మండలంలోని పాఠశాలలను తనిఖీ చేసి ప్రగతి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు. బాధ్యతలు తీసుకున్న ఎంఇవో శంకరయ్యను యూటిఎఫ్, ఎస్‌టియూ నాయకులు దుశాలువతో సన్మానించి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేశయ్య, శ్రీనివాసులు, రామ్మూర్తి, పీతాంబర్ రెడ్డి, సుభాష్, పరమాత్మయ్య, పురుషోత్తం, సిఆర్‌పీలు మనోహర్, అంకయ్య, సురేష్, గీత, ఇందిర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## 19న జిల్లా స్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

**తిరుపతి (క్రీడ), మార్చి 16, ప్రభాతవార్త**

తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌చే జిల్లా స్థాయి ఫుట్ బాల్ లీగ్ పోటీలు జిల్లాలోని స్కూల్, బాల బాలికలకు జరుపుటకు ఈ నెల 19వ తేది ఎస్వి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి. సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో జిల్లాలోని 12 టీమ్‌లు వరకు రావడానికి సమ్మతి తెలియజేసారు. రేణిగుంట, పుత్తూరు, చంద్రగిరి తదితర మండలాలో నుంచి వస్తున్నారన్నారు. ఈ పోటీలు జరుపుటకు ముఖ్య ఉద్దేశ్యం స్కూల్‌లోని పిల్లలలో నైపుణ్యాన్ని గుర్తించి వారికి ఆటలలో మెలుకువలను మేరుగు పరచి మంచి ఆటగాళ్లగా తయారు చేయడం జరిగిందన్నారు. ఈ పోటీలు జిల్లా ప్రాధికార సంస్థ, తిరుపతి ఓలంపిక్ జిల్లా అసోసియేషన్ తిరుపతి వారి సహకారంతో జరుపడం జరుగుతుందన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికేట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరంలో మేలో జరిగే సమ్మర్‌కోచింగ్ క్యాంప్‌కి సెలెక్ట్ చేయడం జరుగుతుందన్నారు.

## ప్రపంచ మేటి రికార్డుల ఘనాపాటి వేదనరసింహా

**తిరుపతి (క్రీడ), మార్చి 16, ప్రభాతవార్త**



తిరుపతి పట్టణంలోని కొర్లగుంటలోని ప్రశాంత్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న కోటంబేడు వేదనరసింహా స్కేటింగ్ ప్రపంచ స్థాయి రికార్డులు కొల్లగొట్టాడు. అందులో భాగంగా ఏషియన్ ఫసిఫిక్ రికార్డు, వజ్రవరల్డ్ రికార్డుతో పాటు ఏర్పేడు నుంచి వెంకటగిరి, రాపూరు పెంచలకోన, బుచ్చివెర్మి పాళెం, కోవూరు మీదుగా గూడూరు వరకు నాన్ స్టాప్ 270 కిలో మీటర్ల రోడ్ స్కేటింగ్ మార్తాన్‌లో పాల్గొని గ్లోబల్ రికార్డ్స్ నాన్ స్టాప్ 270 కిలో మీటర్‌ను అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని టిఎంసి తిరుమల బైపాస్ రోడ్ నుంచి కొర్లగుంట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అందులో విద్యార్థులు, కోచ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో పాలు పంచుకోవడం వారి సమగ్ర వికాసానికి దోహదం చేస్తుందన్నారు. రికార్డుల విజేత వేదనరసింహను అభినందించారు. ఈ ఘనత సాధించడానికి కారకులైన తమ ఉపాధ్యాయ బృందాన్ని కీలక భూమిక పోషించిన విద్యార్థి తల్లిదండ్రులను, కోచ్ ప్రతాప్‌ను కొనియాడారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములకు రాయలసీమ రంగస్థలి నివాళులు

**తిరుపతి (క్రీడ), మార్చి 16, ప్రభాతవార్త**



ఆంధ్ర రాష్ట్ర సాధనపై అమరణ నిరా హార దీక్షకొనసాగించి, అశువులు బాసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని రామలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. తెలుగు వారికి వారు చిరస్మరణీయులన్నారు. వారి జయంతి సందర్భంగా తిరుపతి రుయా హాస్పిటల్ సర్కిల్ వద్ద వున్న వారి విగ్రహానికి పూల మాలను సమర్పించి నివాళు లు అర్పించారు. మహనాయకులను స్మరించుకోవడం మానవత్వమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కెఎన్ రాజా, కె. సుబ్రమణ్యం రెడ్డి, టీచర్ తిరుమలయ్య, ఆదిస్వామి, యబ్బిల వెంకట్రామయ్య, టి. సుబ్రమణ్యం రెడ్డి, ఎం. రవికుమార్ పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు

**రేణిగుంట, మార్చి 16 ప్రభాతవార్త:** రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం ఎంపీడీవో హరిబాబు గురువారం రేణిగుంట పట్టణంలోని పలు వీధుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని వీధుల్లో కొంత మంది రోడ్డును ఆక్రమించి కట్టడాలు నిర్మించడన్ని గుర్తించి వెంటనే తొలగించాల్సిందిగా ఆదేశించారు. మరి కొంత మంది తమ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ స్థలాలు తమ సొంత స్థలాలుగా వినియోగించుకోవడానికి తప్పు పడుతూ అలా చేయడం నేరమని హెచ్చరించారు. వీధుల్లో హ్యాండ్ బోర్లు నిరుపయోగంగా ఉండడాన్ని గుర్తించి వాటిని మరమ్మతులు చేయించడానికి ఉన్నతాధికారులు, మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితోచర్చించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించడానికి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పబ్లిక్ కొళాయిలను తమ సొంత కొళాయిలుగా భావించి కొంత మంది పైపులు తగిలించి నీటిని వాడుకోవడాన్ని తప్పుపడుతూ పైపులను తొలగించి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి ఉపయోగపడాల్సి న మౌలికసదుపాయాలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే వారికి నోటీసులు ఇస్తామన్నారు. తీవ్రతను బట్టి జరిమానా విధించడానికి కూడా వెనుకాడబోమ్మన్నారు.

## మానవతా దృక్పథంతో . . .

**వరదయ్యపాళెం, మార్చి 16 ప్రభాతవార్త**



వరదయ్యపాళెం మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల బ ందోబస్తును కట్టుదిట్టంగా ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలకు ఓ విద్యార్థి గురువారం ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చాడు. అయితే ఆతని వద్ద టైం ప్రకారం ఇంకా మరో నిముషం ఉండగా పాఠశాల సమయం తేడా వచ్చింది. పైడా ఆ విద్యార్థి వద్ద హాల్ టిక్కెట్లు లేదు. దాంతో ఎస్ఐ ససేమిరా అన్నారు. అయితే మానవతాదృక్పథంతో స్పందిం చారు. ఆతన్నిలోపలకు పంపాలని ఎస్ఐకు సూచించారు. వెంటనే ఆన్‌లైన్లో ఆతని హాల్‌టిక్కెట్టును డౌన్‌లోడ్ చేసి విద్యార్థి ఒక సంవత్సరం చదువుకు సార్థకత కల్పించారు. దాంతో ప్రిన్సిపల్‌చౌరవనువిద్యార్థితల్లిదండ్రితోపాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 16 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధకుడు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) మరియు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక రుయా ఆసుపత్రి ముందున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, 500 మంది నిరు పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ అనాదిగా మన తెలుగువారు మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉంటూ రెండవ కేటగిరీ వ్యక్తులుగా ఉంటూ ఎన్నో అవమానాలు పొందారు. వీటిని చూసి తట్టుకోలేక మన తెలుగు వారికంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి, తన ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్రం కోసం అశువులు బాసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములని ఆయన కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి భారత ప్రభుత్వం భారత రత్న బిరుదును ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు వికాస్, కార్తీక్, శబరీష్, అవోపా అధ్యక్షుడు శివకుమార్, జీవన్‌కుమార్, జగదీష్ కృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్ పంపిణీ

**విజయపురం, మార్చి 16 ప్రభాతవార్త :**



మండలంలోని కళియంబాకం దళితవాడలో గురువారం సర్పంచ్ విద్యాభాస్కర్‌రెడ్డి వైసిపి పార్టీ తరపున వచ్చిన క్రికెట్ కిట్‌ను యువతకు పంపిణీ చేశారు. యువతలో క్రీడా శక్తిని పెంపొందించడం కోసం మంత్రి రోజా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు యువత పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

**శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని గురువారం ఘనంగ నిర్వహించారు. ఈసందర్భంగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని తెలుగుజాతి ఉన్నంత వరకు మరువలేమన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పిజె. చంద్రయ్య మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ అనుచరుడుగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు కోసం రాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడు త్యాగం తెలుగుజాతి ఉన్నంత వరకు ఉంటుందన్నారు. కేంద్రప్రభుత్వం ఆర్యవైశ్యులు ఆరాధ దేవత వాసవికన్యకపరమేశ్వరిదేవి ఉన్న పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ నాయకులు రాముగుప్తా, రూపేష్, ఆనంద్‌గుప్తా, నాగేశ్వరరావు, మురళీ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త:**



అహింసా మార్గంలో ఆంధ్రప్రదేశ్‌ను సాధించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుకుమార్ కొనియాడారు. అగరాల వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం అమరజీవి జయంతి వేడుకలు నిర్వహించి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ప్రాముఖ్యత, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను తెలుగు ప్రజలు అందిపుచ్చుకోవాలనే సంకల్పంతో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టినట్లు వివరించారు. గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన ఆయన అణగారిన వర్గాల కోసం విశిష్ట సేవలందించారన్నారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ క్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు తిరుపతి సెట్విన్ మేనేజర్ కె. మోహన్ కుమార్ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, స్టడీ స్కిల్స్ అండ్ కెరీర్ కౌన్సిలింగ్‌పై ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్. రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ నరశింహా రెడ్డి డాక్టర్ పి. భక్తవత్సలం, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**తిరుపతి (క్రీడ), మార్చి 16, ప్రభాతవార్త**




తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్‌లో వినియోగదారుల క్లబ్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండి వినియోగదారులుగా మనకున్న హక్కులను బాధ్యతగా తెలుసుకుని కొన్న ప్రతి వస్తువు ఒక బిల్లు, గ్యారెంటీ కార్డు లాంటివి తీసుకుని మనకు నష్టం అన్యాయం జరిగినప్పుడు, అప్పటికప్పుడే ప్రశ్నించి న్యాయం పొంది, ప్రతి విద్యార్థి విజ్ఞానవంతుడైన వినియోగదారులుగా భవిష్యత్తులో సమాజాన్ని చైతన్యవంతులు చేయడం ఓ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని కోరారు. విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా నాణ్యతలేనిజంక్‌ఫుడ్స్ తినడంవల్లచిన్నతనంలోనే కంటి చూపు, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి ప్రమాదకరమైన వ్యాధులకు బలవుతున్నారని ప్రతి విద్యార్థి కల్తీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## 19న సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

**తిరుపతి (క్రీడ), మార్చి 16, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 19వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు బిఆర్ స్టేడియం టుంటూరులో నిర్వహిస్తున్నట్లు శాప్ విసి, ఎండి తెలిపారు. ఔత్సాహికులైన మహిళా కబడ్డి క్రీడాకారిణులు 75 కేజీలు లోపు బరువు వారు అర్హులు. ఎంపికైన వారు 69వ జాతీయ స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీలు ఈ నెల 23 నుంచి 26 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుందని సెట్విన్ సిఇఓ, చీఫ్ కోచ్ మురళీకృష్ణ తిరుపతి జిల్లా కబడ్డీ క్రీడాకారిణులకు తెలిపారు.

## ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

**నగరి, మార్చి 16 ప్రభాతవార్త:**



ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమైంది. తొలి రోజు తెలుగు, తమిళం, సాన్‌స్క్రిట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.45 గంటలకంతా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్క్వాడ్ బృందం కేంద్రాల్లో పర్యటించింది. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలి రోజు పరీక్షకు మండలంలో 909 మంది విద్యార్థులకు గాను 897 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

## బ్యాంకు పథకాలపై రైతులకు అవగాహన

**నగరి, మార్చి 16 ప్రభాతవార్త:**

సహకార బ్యాంకులు, సహకార సంఘాలు అందించే వివిధ పథకాలపై కళా బృందం వారిచే రైతులకు అవగాహన కల్పించారు. గురువారం సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళా బృందం ద్వారా రైతులకు అర్థమయ్యే విధంగా పథకాలను వివరించడం జరిగింది. ఎఫ్ఎల్‌సీ కో-ఆర్డినేటర్ హేమ ప్రకాష్ మాట్లాడుతూ బ్యాంకు వారు అందించే వివిధ రకాల రుణ సదుపాయాలను రైతులకు వివరించారు. బ్యాంకు సూపర్‌వైజర్ ఓ. ఆనందన్ మాట్లాడుతూ స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలకు మార్చి 31 వరకు మాత్రమే వడ్డీకి అపరాధపు వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నగరి పీఏసీఎస్ డైరెక్టర్ దామోధరంనాయుడు, సీఈవో తులసిపిళ్లై, బ్యాంకు సూపర్‌వైజర్ కార్తీక్, సంఘం సిబ్బంది గుణశేఖర్, శేఖర్, లేపాక్షి, తనికాచలం, అప్రైజర్ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.


రె.కానెం 05/2023

### బహిరంగ వేలపు నోటిఫికేషన్

గ్రామపంచాయితీ కార్యాలయము
తిరుచానూరు, తేది: 16-03-2013

చిత్తూరు జిల్లా: తిరుపతి రూరల్ మండలం:తిరుచానూరు గ్రామపంచాయితీ :-ప్రైవేటు బస్టాండ్ మరియు అంగడి గదులుల

2023వ సంవత్సరము ఏప్రిల్ నెల 01 తేది మొదలు 2024 వ సం॥మార్చి నెల 31వ తేది వరకు కూడిన ఒక సంవత్సరమునకు తిరుచానూరు గ్రామ పంచాయితికి చెందిన టూరిస్టు బస్టాండు APSRTC బస్సులు ప్రభుత్వ వాహనములు మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహాయించి) నందు రుసుము వసూలు చేయు గుత్తహక్కును మరియు వాణిజ్య సముదాయపు అంగిడి గదులను నెలవారి బాడుగ పద్ధతిపై ఇచ్చుటకు 2023-2024వ సంవత్సరమునకు 23-03-2023వతేది గురువారము ఉదయం10.00గం॥ల నుండి మధ్యాహ్నం 2.00గం॥ల వరకు తిరుచానూరు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు గ్రామ పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. అనంతరము సాయంత్రం 3.00గం॥ల నుండి బహిరంగ వేలము వేయబడును. బహిరంగవేలము తదుపరి సీల్డు టెండర్లను టెండరుదారుల సమీక్షమున తెరువబడును. వేలము నందు మరియు సీల్డు టెండరు నందు హెచ్చుపాట ఏదైతే దానినే పరిగణలోనికి తీసుకొనబడును. సదరు బహిరంగం వేలమును నిలుపుదల చేయుటకు పాక్షికంగా రద్దు పర చుటకు పంచాయితి కార్యదర్శి వారికి అధికారము కలదు.

| క్రమ సంఖ్య | గుత్త వివరములు | చెల్లించవలసిన ధరవత్తు | సబ్-రిజిస్ట్రారు/తహసిలారు కార్యాలయము నుండి అవసరమగు సాల్వెన్సీ | సాల్వెన్సీ లేని వారు చెల్లించ వలసిన ధనావత్తు |
|---|---|---|---|---|
| 1. | ప్రైవేటు టూరిస్టు బస్టాండు APSRTC ప్రభుత్వ వాహనములు మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహా ) | 25,00,000/- | 25,00,000/- | 40,00,000/- |
| 2 | 20 అంగడి గదులు(గదినెం. 11తప్ప) నెలవారి బాడుగ పద్ధ తిపై బహిరంగవేలము ద్వారా కేటాయించుటకు (8వ నెంబరు గల గదిని నాయి బ్రహ్మణులకు మాత్రమే కేటాయించడ మైనది. | 20,000/- | | |
| | అంగడి గది నెం. 11 నకు (మెట్లక్రింద గది) | 10,000/- | | |

### చెల్లించవలసిన ధరావత్తు వివరములు

షరా:1) వేలములో పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయితికి ఎటువంటి బకాయిలు వుండరాదు. ధరావత్తు మొత్తము చెల్లించుటకు జాతీయ బ్యాంకుల నుండి తీసిన డి.డి.లు/బ్యాంకర్స్ చెక్కులు మాత్రమే స్వీకరించబడును. డి.డి.లు/బ్యాంకర్స్ చెక్స్‌లు పంచాయితీ సెక్రటరి. గ్రామపంచాయయితీ, తిరుచానూరు పేరున తీసి వేలమునకు ముందుగా అందజేయవలెను. హెచ్చు పాటదారుని పాటను గ్రామ పంచాయితి వారు ఖాయపరిచన పిదపనే మిగిలిన డిపాజిట్టుదారులకు నిబంధనల మేరకు వారి డి.డిలను వారికి వాపసు చేయబడును. బహిరంగవేలము పూర్తి అయిన వెంటనే ఒకటవ రెండవ హెచ్చుపాటదారుల వేలము డిపాజిట్టు మినహా మిగిలిన వారికి వారు చెల్లించిన డిపాజిట్టు డి.డి.లు /బ్యాంకర్స్ చెక్కులు వాపసు ఇవ్వబడను.
2) నిర్ణీత డిపాజిట్లు చెల్లించిన వారిని మాత్రమే బహిరంగవేలమునకు అనుమతించబడును. ఇతరులు బహిరంగవేలము నందు పాల్గొనుటకు అనుమతించబడదు. మరియు డిపాజిట్టు చెల్లించువారు జి.యస్.టి. నెంబరును కలిగివుండవలెను మరియు పాస్‌పోర్టుసైజు ఫోటో ఒకటిని మరియు నివాసపు నిర్ధారణ కార్డులు అనగా ఆధార్/ ఓటరు కార్డు/ డ్రైవింగు లైసెన్సు/ పాన్ కార్డు / పాస్‌పోర్టు /రేషన్‌కార్డు ఏదేని ఒకటిని అర్జీకి జతపరచి ఇవ్వవలెయును.
3) సాల్వెన్సీ అనగా సబ్ రిజిష్టరు/తహసీల్దార్ కార్యాలయము నుండి పొందిన సాల్వెన్సీ మాత్రమే స్వీకరించబడును. మరియు బ్యాంకు గ్యారంటీ అనగా (సాల్వెన్సీ సర్టిఫికేట్ నందు పొందపరచబడిన గ్యారంటీ మొత్తము పాటదారుడు చెల్లించని యెడల బ్యాంకు వారు పూచికత్తుగా వుండు విధముగా)
4) వేలపుదారుడు వేలము ఖాయపరిచిన 7 రోజుల లోపల వేలుపు మొత్తము మరియు ప్రస్తుతం పరిగణలో ఉన్నరేట్ల మేరకు స్టాంపు డ్యూటీని చెల్లించ వలెయును మరియు నిబంధనల మేరకు Income Tax మరియు GST చెల్లించవలెను.

### షెడ్యూలు -1 ( ప్రైవేటు బస్టాండు)
రుసుములు వసూలు చేయవలసిన వివరములు

| వ.నెం | టూరిస్టుబస్టాండు నందు వసూలు చేయవలసిన వాటి వివరములు | వసూలు చేయవలసిన రుసుము |
|---|---|---|
| 1. | తిరుపతి తిరుచానూరు తిరుగు ప్రైవేటు బస్సులకు 1 కి రోజుకి 1 కి | 100.00 |
| 2. | టూరిస్టు బస్సులకు మెటడోరు వ్యాన్ రోజు 1 కి | 100.00 |
| 3. | శ్రీ శ్రీనివాసా మాక్సి క్యాబ్‌వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లైసెన్సు పొందిన వారి వద్ద నుండి మాత్రం మెటడోరు వ్యాను రోజు 1 కి | 70.00 |
| 4. | క్వాలీస్, సుమో, ట్రాక్స్, కారు మొదలగు వాహనములకు 1 రోజు 1 కి | 60.00 |
| 5. | జీపు, ట్రాక్టరు మొదలగు వాహనములకు 1 రోజు 1 కి | 50.00 |
| 6. | ఆటో వాహనములకు 1 రోజు 1 కి | 5.00 |

గమనిక : బస్టాండు ప్రస్తుతము ఉన్న రీతిలోనే ఫీజులు వసూలు చేసుకొనవలెను. అదనముగా బస్టాండునకు ఎటువంటి సదుపాయములు కల్పింబడువు.
ముఖ్యగమనిక :- వేలపు నిబంధనలు వరున నెం:1 నుండి 35 వరకు కార్యాలయపు పనివేళల యందు వచ్చి తెలుసుకొనవచ్చును.

| | | |
|---|---|---|
| కె. రామచంద్రారెడ్డి<br>సర్పంచ్<br>తిరుచానూరు గ్రామ పంచాయితి | డి. నీలకంఠేశ్వర రెడ్డి<br>విస్తరణాధికారి (పం.రా. మరియు గ్రా.అ)<br>తిరుచానూరు గ్రామ పంచాయితి | పి. లక్ష్మినారాయణ<br>పంచాయితి కార్యదర్శి<br>తిరుచానూరు గ్రామ పంచాయితి |

## దండలామ్మ.... దయగల తల్లి కరుణించు



చిల్లకూరు మార్చి 16 ప్రభాతవార్త

తూర్పు కనుపూరు గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో మూడో రోజు ఆలయం భక్తుల తాకిడి ఎక్కువైంది. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. దండాలమ్మ....దయగల తల్లి కరుణించు అంటు భక్తులు ఆలయం ప్రాంగణం మారుమ్రోగింది. పోలేరమ్మ ఆలయంలో వివిధ రకాల పూలతోపాటు విద్యుత్ దీపాల అలంకరణ సుందరంగా తీర్చిదిద్దారు. క్యూలైన్‌లో భక్తులు రద్దీఎక్కువగా ఏర్పడింది. కనుపూరు వీధులలో రంగులరాట్నం, జాయింట్ వీల్ మరికొన్ని విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి, ఆలయ పరిసరాలలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించారు. పోలేరమ్మ తల్లికి భక్తులు కానుకలుగా దున్నపోతు సమర్పించారు. ఈకార్యక్రమాలను ఆలయ ఇఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

## చెంగాళమ్మ సన్నిధిలో సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు

సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళ మాత పరమేశ్వరిదేవిని ప్రముఖ సినీ దర్శకుడు సింగీతం శ్రీనివా సరావు గురువారం దర్శించు కున్నారు. దేవస్థానానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు వంకా దినేష్, ముప్పాళ్ల చంద్ర శేఖర్‌రెడ్డి, ఆర్‌ఎన్‌వి భాస్కర్ బాబు, ఉస్మాన్‌బాషా, డాక్టర్ పరుచూరి సుబ్రహ్మణ్యం, సుధా పాల్గొన్నారు.

## వరసిద్ధుని సేవలో సినీనటుడు సత్యప్రకాష్



కాణిపాకం, మార్చి 16 ప్రభాతవార్త:

ప్రముఖ సినీ నటుడు సత్యప్రకాష్ గురువారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అలాగే సత్యప్రకాష్ శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక నాయకులు పుణ్యసముద్రం కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

### న్యాయం చేయాలని గ్రామస్తుల ధర్నా

వి.కోట, మార్చి 17 ప్రభాతవార్త



మండలంలోని నడమంత్రం గ్రామ సమీపంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుల కథనం మేరకు వివరాలిలా.. ముదరందొడ్డి పంచాయతీ నడమంత్రం చెరువు వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో అదే గ్రామానికి చెందిన కృష్ణప్ప (52) మృతి చెందగా బాలాజీ (45) తీవ్రంగా గాయ పడ్డాడు. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన బాలాజీ నీటిలో ఇరుక్కుపోగా అతన్ని కాపాడేందుకు వెళ్లిన కృష్ణప్పకు పక్కనే గల విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడు. బాలాజీకి తీవ్రగాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా పలుమార్లు విద్యుత్ లూజు లైన్లపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు వి.కోట పట్టణంలో జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. అనంతరం విద్యుత్ అధికారులు తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంభూపాల్ తెలిపారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు

### - కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, మార్చి16 ప్రభాతవార్త:



ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జె.సి. బాలాజీతో కలిసి కలెక్టర్ పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరా ములు ఒక గొప్ప త్యాగమూర్తి, భాష ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు మహనీయుడు అని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించి, 1952 డిసెంబర్ 15న అమరులయ్యారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58రోజులు అమ రణ నిరాహార దీక్ష చేసి అమరుడైనారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితం గానే 1956లో ఆంధ్ర రాష్ట్రం నవంబర్ 1న ఏర్పడిందన్నారు. పొట్టిశ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొని, జైలు శిక్ష అనుభవించాడన్నారు. పొట్టి శ్రీరాములు గౌరవార్థం తపాలశాఖ 2000 మార్చి 16న ఒక ప్రత్యేక తపాల బిళ్లను విడుదల చేసారని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాలు నుండి యువత స్ఫూర్తి పొంది, యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని సూచించారు.

# అంబరాన్నింటిన గంగజాతర

పుంగనూరు, మార్చి 16 ప్రభాతవార్త

పుంగనూరులో సుగుటూరు గంగమ్మ జాతర గురువారం ముగిసింది. మంగళవారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమైన జాతర కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలతో పాటూ నగలు సమర్పించారు. బుధవారం పూర్తిగా అమ్మవారి దర్శనానికి లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో సిఐ మధుసూదనరెడ్డి అధ్వర్యంలో బందోబస్తు చర్యలు ముమ్మరం చేశారు. హిందూ జాగరణసమితి, శ్రీసుగుటూరుగంగమ్మ సేవా సమి తిల సభ్యులు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి రప్పించబడిన వందలాది మంది పోలీసు సిబ్బంది తీవ్రంగాశ్రమించి రద్దీను నియంత్రించడంతోపాటూ భద్రత మద్య న భక్తులందరికీ దర్శనాచర్యలు చేపట్టారు. గురువారం తెల్లవారు జామున అమ్మవారి విగ్రహాన్ని ఆలయం నుంచి జలధికి తరలిం చారు. ఈసందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని బజారువీధి గుండా తూర్పుమొగసాలలోని శ్రీచాముండేశ్వరి ఆలయం కోనేరు వద్దకు చేర్చి జలధి కార్యక్రాలు చేపట్టారు. జాతర ముగిసినట్లు ఆసాదులు ప్రకటించగా, పుంగనూరు మాజీ జమీందారులు సోమశేఖరచిక్కరాయలు వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గంగమ్మవిగ్రహాన్ని పాలెస్‌లోని అమ్మవారి గదిలో ఉంచి, శాస్త్రోత్తకంగా పూజలు నిర్వహించి శాంతులు చేసి మరో ఏడాది వరకు పట్టణ, గ్రామాలకు శాంతాలను ప్రసాదించేందుకు అమ్మవారు కరుణించాలని ప్రార్థనలు చేశారు. అమ్మవారిని జలధికి తరలించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖులుఅమ్మవారి పల్లకిని వీధులలో మోసి భక్తిని చాటుకున్నారు. సుగుటూరు గంగమ్మతో పాటూ నడివీధిగంగమ్మ, శిరస్సు గంగమ్మను కూడా జలధికి తరలించారు. ఉత్స వాల నిర్వహణకు తొలి నుంచి తుది వరకు పూర్తిగా సేవలందించిన పట్టణానికి చెందిన పెద్దలు, వివిధ వర్గాల, సంఘాలకు నిర్వాహకులైన జమీందారీ వంశస్తులు అభినందనలు తెలిపారు. జలధి అనంతరం అమ్మవారిని జమీందారి ఆలయంలో నిలిపి తుది పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జమీందారీ కుటుంబాలు, కమిషనర్ వర్మ, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు షరీఫ్, ఛైర్‌పర్సన్ షమీంషరీఫ్, వైస్ సి.అమరేంద్ర, మున్సిపల్ ఉద్యోగులు మాజీ జమీందారి కుటుంబ సన్నిహితుడు మృత్యుంజయేశ్వరరాజు, జమీందారి కుటుంబీకులు, ప్రజలు పాల్గొన్నారు.







## సిపాయి భరోసా పథకానికి

# పాతవీరాపురంలో శ్రీకారం

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 16 ప్రభాతవార్త



సిపాయి భరోసా సరకులను అందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి నియోజకవర్గంతో సన్నిహిత సంబంధాలు కల్గిన రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు ఎంఎల్‌సి పదవి వరించటంతో ఆయన సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వైద్య రంగంలో తనకంటూ ఓ గుర్తింపు ఉంది. అంతేకాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తన వర్గాన్ని బలోపేతం చేసుకో వటానికి దాని ద్వారా పార్టీకి ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రణాళిక రూపొందిం చారు. ఈ పథకానికి 'సిపాయి భరోసా' అని నామకరణం చేసారు.

పాతవీరాపురంలో శ్రీకారం:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పాత, కొత్తవీరాపురాల్లో వన్నెకుల క్షత్రియులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. అక్కడ నుంచి పథకాన్ని అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని కుటుంబయజమాని మరణించిన కుటుంబాలకు, విద్యార్థులకు, గర్భిణీ మహిళలు, బాలింతలకు సిపాయి భరోసా పథకాన్ని సిపాయి ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అందించుటకు నిర్ణయించారు. నిరుపేదలకు ఈ పథకం అండగా ఉంటుందన్నారు. ఏర్పేడు మండలంలోని పాతవీరాపురంలో ఇటీవల మరణించిన మధురాంతకం మునికృష్ణరెడ్డి కర్మక్రియల సందర్భంగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఏడాదికి సరిపడే ఆహారదినుసులను కొడలు మునెమ్మకు అందించారు. డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ అనాధులైన కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో రూపకల్పన చేసామన్నారు. పక్షవాతం వంటి కుటుంబాలకు అండగా ఉండటానికిఈ పథకం రూపొందించినట్లు డాక్టర్ వివరించారు. ఏడాదికి సరిపడ్డ 35 ఆహార దినుసులు అందించి ఆదుకోవాలని నిర్ణయించామన్నారు. ఈ పథకం తమ ఫౌండేషన్ గుర్తించినవారికి మాత్రమేవర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మునిరంగారెడ్డి, యువనేస్తం అధ్యక్షుడు మునిశేఖర్, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే, గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యధర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి

తిరుపతిరూరల్, మార్చి16 ప్రభాతవార్త:

జిల్లాలో రీ సర్వే, జాతీయ రహదారుల భూ సేకరణ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని రాష్ట్ర ప్రధాన కార్యధర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని కలెక్టర్లను, సంబంధిత అధికారులను ఆదేశించారు. అమరావతి నుండి ప్రధాన కార్యధర్శి వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్, జె.సి.బాలాజీ హాజరయ్యారు. వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భూ హక్కు, భూ రక్ష రీ సర్వేలో గ్రౌండ్ వ్యాలిడేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ స్టోన్ ప్లాంటేషన్‌ను వేగవంతం చేయాలని, ఎల్ పి ఎం ఆధారిత రీ సర్వే వివరాలను అన్‌లైన్‌లో అప్లోడ్, వెబ్‌ల్యాండ్ 2.0లో రీ సర్వే గ్రామాల భూముల వివరాలను వారంలోపు నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశాలు ఉన్నందున ప్రజలు అత్యవసరం ఉంటేనే మధ్యాహ్నం గంటల 12 నుండి 3గంటల వరకు బయటకు రావాలని సూచించారు. వైద్యశాఖ పిహెచ్‌సి స్థాయిలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓ ఆర్ ఎస్ స్యాచెట్‌లు తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాఠశాలలు, విద్యాలయాల్లో తగినంత నీరును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పేదలందరికి ఇళ్ల కార్యక్రమంలో భాగంగా అన్ని లే అవుట్‌లలో త్రాగునీటి కుళాయిలు ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్స్, అంతర్గత రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్త వంటి మౌళిక సదుపాయాల కల్పన ఏర్పాటుతో లబ్దిదారులు ఇంటిలో చేరేలా ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ఎస్ హెచ్ జిల ద్వారా అదనపు ఋణం లబ్దిదారులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీల హాజరు, పని దినాలు పెంచాలని, అమృత్ సరోవర్ కింద చెరువుల అభివృద్ధి పనులలో పురోగతి ఉండాలని, ఉన్నతస్థాయిలో ప్రధాన మంత్రి ప్రగతి సమావేశంలో సమీక్షిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాది, మంచి కంపెనీలలో ఉపాధి స్కిల్ హబ్, స్కిల్ కాలేజ్‌ల ద్వారా విద్యార్థులకు స్వయం ఉపాధి, మంచి కంపెనీలలో ఉపాధి అవకాశాల కల్పన దిశగా పురోగతి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి కుశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) 4.0 కింద జిల్లా లక్ష్యంగా 1920 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మెప్మా సహకారంతో మండలాల వారీగా, పట్టణాల వారీగా లక్ష్యాలను నిర్ధేశించుకుని ఏప్రిల్ మొదటివారం నుండి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి వేంకటేశ్వర్లు, డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్, జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా ఆర్‌డబ్ల్యుయస్ అధికారి విజయకుమార్, పంచాయతీరాజ్ ఇంజనీరు శంకరనారాయణ, మెప్మా పిడి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రుల కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు

### జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి

తిరుపతి క్రైం, మార్చి 16, ప్రభాతవార్త



ఆంధ్రుల కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం కావాలని ఆయన చేసిన త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటుందని, సమాజం కోసం జన్మించిన వారిలో పొట్టి శ్రీరాములు అగ్రగణ్యుడని, తెలుగు రాష్ట్రాల్లో పేరు సంపాదించిన మహోన్నత వ్యక్తని, తెలుగు వారి గుండె చప్పుడు పొట్టి శ్రీరాములని తెలిపారు. సత్యాగ్రహంతో ఆంధ్రుల కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని, ప్రతి తెలుగు వారు గుర్తు పెట్టుకోవాలని, సమాజం కోసం, ప్రజల కోసం చేసే మంచి పని చిరస్థాయిగా నిలిచిపోతుందని జిల్లా పి. పరమేశ్వర రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పిలు అడ్మిన్ శ్రీ వెంకటరావు, ఏఆర్ లక్ష్మినారాయణ రెడ్డి, డిఎస్పిలు వేణుగోపాల్, ఎఆర్ నందకిషోర్, ఏఆర్ రవీంద్ర రెడ్డి, ఎస్‌బి సిఐ రామకృష్ణ ఆచారి, ఆర్ఐ చంద్రశేఖర్, సిఐలు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మెరుగుపడిన పులి కూనల ఆరోగ్యం

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 16 ప్రభాతవార్త:



నంద్యాల జిల్లా ఆత్మకూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో తల్లి పులి నుండి దూరమై తిరుపతి ఎస్వీ జూ పార్కుకు చేరిన నాలుగు పులి కూనల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగుపడిందని జూ పార్కు వెటరినరీ డా॥సత్యప్రకాష్ అరుణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు జూకు చేరిన సమయంలో అవి డీహైడ్రేషన్‌కు లోనై ఉన్నాయి. ఆరోగ్యపరంగా మూడు పులి కూనలు యాక్టివ్‌గా ఉన్నా, అందులో ఒకటి మాత్రం మొదటి రోజు సాయంత్రం వరకు కొంత నీరసంగా ఉందన్నారు. తిరుపతి వెటరినరీ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు డాక్టర్ల బృందం వచ్చి జూకు చెందిన డాక్టర్లు, అధికారుల సమక్షంలో వాటికి అన్ని రకాలుగా వైద్య పరీక్షలు నిర్వహించి వారి అబ్జరేషన్‌లో ఉంచడం జరిగిందన్నారు. వాటికి రోజులో 5 విడతలుగా రాయల్ కెనాన్ మిల్క్ పౌడర్‌తో పాటు ఉడికించిన చికెన్, చికెన్ లివర్‌ను అవి తినగలిగినంత ఆహారంగా అందిస్తూ 24 గంటలూ పర్యవేక్షిస్తున్నామన్నారు. ముఖ్యంగా మొదటి రోజుకంటే రెండవ రోజుకు వాటి ఆరోగ్యం కాస్త మెరుగుపడింది. ఆనాటి నుండి రోజు రోజుకు ఆరోగ్య పరంగా వాటిలో డెవలప్‌మెంట్ కనిపిస్తోందన్నారు. పెట్టిన ఆహారం కూడా ఏమాత్రం విడిచి పెట్టకుండా మొత్తం తింటున్నాయని అన్నారు. దీంతో తమకు అలాగే జూ అధికారులకు కూడా వాటి ఆరోగ్య పరిస్థితిలో ప్రస్తుతానికి ఎలాంటి భయాందోళనలు లేవని డా॥సత్యప్రకాష్ అరుణ్ అన్నారు.

## రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు కృషి శ్లాఘనీయం

### -ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు

తిరుపతి ప్రెస్‌క్లబ్, మార్చి 16 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కృషి ఎనలేనిదని ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. స ం తో ష రా వు అన్నారు. గురువారం స్థానిక ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సిఎండి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, అమరజీవిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన దీక్ష ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని ఆయన వివరించారు. ఆయన గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులై అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని, భావి తరాలకు ఆదర్శంగా నిలిచారని కీర్తించారు. ఆయన స్ఫూర్తితో ఉద్యోగులందరూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, జాతీయ స్థాయిలో సంస్థ అత్యున్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ఎన్‌వివిఎస్. సుబ్బరాజు, ప్రాజెక్ట్స్ అండ్ ఐటి డైరెక్టర్ కె. శివప్రసాద్‌రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ వివిఎన్. బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్. వరకుమార్, వై. లక్ష్మీనరసయ్య, కె. విజయ్‌కుమార్‌రెడ్డి, కె. గురవయ్య, జాయింట్ సెక్రటరీ రాధా జయశ్రీ, జనరల్ మేనేజర్లు ఆదిశేషయ్య, సురేంద్రరావు, సత్యనారాయణ, శారద, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంగా ఉత్కంఠత

**కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు**

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం నేడు వెల్లడికి అవకాశం**





చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త:

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల వెల్లడిపై ఉత్కంఠత నెలకొంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం వెల్లడి అయినప్పటికీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఎస్వీసెట్ కళాశాల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటల నుండి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల మొత్తం తక్కువగా వుండటంతో ఈ ఓట్లను ఓట్ల లెక్కింపు సిబ్బంది చకచకా కట్టలు కట్టారు. గురువారం సాయంత్రం 3 గంటల నుండి ఓట్ల లెక్కింపు కార్యక్రమంను ప్రారంభించారు. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు ఎక్కువగా వుండటంతో వీటిని 25 ఓట్లుగా వేరు చేసే ప్రక్రియను సిబ్బంది ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. అయితే గురువారం రాత్రి అయినా ఓట్ల కట్టలు కట్టే కార్యక్రమం పూర్తి కాని పరిస్థితి నెలకొంది. శుక్రవారం తెల్లవారుజాము పట్టభద్రుల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం అయ్యే అవకాశం కన్పిస్తుంది. ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఎన్నికల పరిశీలకులు కోన శశిధర్, కాటమనేని భాస్కర్‌ల పర్యవేక్షణలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఆర్‌ఓ రాజశేఖర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, తిరుపతి డిఆర్‌ఓ వెంకటేశ్వరరావు, నెల్లూరు డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, ప్రకాశం డిఆర్‌ఓ ఓబులేశు, మదనపల్లి ఆర్డీఓ మురళి, నెల్లూరు ఆర్డీఓ మలోలా, బాపట్ల ఆర్డీఓ రవీంద్ర, శ్రీకాళహస్తి ఆర్డీఓ ఎస్.రామారావు, గూడూరు ఆర్డీఓ కుమార్, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక పలు జిల్లాల అధికారుల సమక్షంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమంను పక్కాగా చేపట్టి పూర్తి చేయడానికి సిబ్బందికి మూడు షిఫ్టులుగా విభజించి విధులు నిర్వర్తించేలా చేశారు. మొదటి షిఫ్ట్‌లో ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండవ షిఫ్ట్ మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు, మూడవ షిఫ్ట్ రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 24,741 ఓట్లు పోల్ కాగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 2,69,809 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లో 2,68,387 ఓట్లు పోల్ కాగా, తిరుపతిలో రెండు పోలింగ్ బూత్‌లలో జరిగిన రీపోలింగ్‌లో 636 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లలో 786 ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఆర్‌విఎస్ లా కళాశాలలో 14 టేబుళ్ళను ఏర్పాటు చేయగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఆర్‌విఎస్ ఇంజనీరింగ్ కళాశాల డ్రాయింగ్ హాలులో 40 టేబుళ్ళు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 916 మంది సిబ్బందిని నియమించగా ఇందులో 193 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో పరిశీలకులు వున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సాయంత్రం 4 గంటల సమయానికి చివరి 124 బ్యాలెట్ బాక్సులను ఏజెంట్ల సమక్షంలో తెరచి కట్టలు కట్టడానికి తీసుకెళ్ళారు.

## పొయ్య పంచాయతీలో

# జ్వరాలతో ప్రజలు సతమతం

### -పట్టించుకోని అధికారులు



పొయ్య పంచాయతీలో జ్వరాలతో మంచంపట్టిన ప్రజలు

తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త

మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈనేపథ్యంలో మండలంలోని పొయ్య పంచాయతీలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు మాత్రం తూతూమంత్రంగా మెడికల్ క్యాంపులు పెట్టి ఏం జ్వరాలులేవని పారిశుద్యం వల్లే జ్వరాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. గత కొద్దిరోజుల క్రితం విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు పట్టించుకోని అధికారులు అనే శీర్షికన పలు వార్తా పత్రికలలో ప్రచురితమైన విదితమే. ఈనేపథ్యంలో మండలంలోని పొయ్య పంచాయతీలో యస్‌సి కాలనీ దుస్థితి, అధికారులు తీరుపై ఆగ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొయ్యా గ్రామంలోను, హరిజనవాడ, మల్లిగుంట గ్రామంలో సుమారు 30మందికిపైగా జ్వరాలతోసతమతం అవుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం ఎలాంటి కేసులు నమోదు కాలేదని పేర్కొంటున్నారు. అపరిశుభ్రంగా పరిసరాలు ఉండడం వల్లే జ్వరాలు వస్తున్నాయని ప్రతి ఒక్కరు వేడినీటిని తాగాలని, అవసరమైన నీటి నిల్వలు కానీ, వారానికి మించి నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రపరచకపోవడం కానీ, దోమలవృద్ధికి, లార్వా పెరుగుదలకు కారణమని పలువురు భావిస్తున్నారు. ఓవైపు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలతో మంచంపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.